కథ

# నానిగాడూ- కుక్కపిల్లా

**పెళ్ళైన ఏడాది తర్వాత వాణి నాతో, "మీకో శుభవార్త! మీరు తండ్రి కాబోతున్నారు" అన్నప్పుడు నా గుండె గుభేల్మంది. ఎందుకంటే-**

వెర్రివాడి పెళ్ళాం వాడకంతా వదిన అంటుందో సామెత. అందులో వదినపడే కష్టాలేమిటో నాకంతగా తెలియవు. కానీ పెళ్ళికాని మరిది వదినకు ఏమవుతాడో ఏ సామెతా చెప్పదు. మరి నా కథ వింటే ఏ సాహితీపరుడైనా ప్రభావితుడౌతాడేమో చూడాలి.

నేను అమ్మ, నాన్న, అన్నయ్య, వదినలతో ఉంటున్నాను. చదువుకు పొరుగు రాష్ట్రాలు వెళ్ళినా ఉద్యోగం ఉన్న ఊళ్ళోనే చేస్తున్నాను. ఆఫీసు పరంగా అన్నయ్యవీ నావీ ఒకటే టైమింగ్సు. అయినా పెళ్లి కాలేదన్న ఒక్క కారణం ఆసరాగా చేసుకుని వదిన నన్ను బొత్తిగా పనిలేనివాణ్ణిగా భావిస్తుంది. నాకు పని చెప్పడమే ధ్యేయంగా పెట్టుకుంది.

ఫిర్యాదు చేద్దామంటే నాన్నకు నా మీద సదభిప్రాయం ఎప్పుడూ లేదు. నేను ఆగమ్మకాకినన్న ఆయన అభిప్రాయం నాకుద్యోగం వచ్చేక కూడా మారలేదు. నేను వదిన చెప్పిన పనులన్నీ చేసి ఒక్క నిముషం విశ్రాంతిగా కూర్చుంటే, "అలా ఊరికే కూర్చోకపోతే వదినకు కాస్త సాయం చేయొచ్చుకదురా" అంటూ మందలిస్తూంటారాయన. ఏ మూలనుంచి వింటూంటుందో మరి వదిన చటుక్కున వచ్చి, "పెళ్ళయ్యాక బాధ్యతలెలాగూ తప్పవు. ఇప్పుడైనా కాస్త రికామీగా తిరగనివ్వండి మామయ్యా!" అనేసి మాయమైపోతుంది. ఆ తర్వాత నాకు నాన్న నుంచి పెద్ద క్లాసు.

అమ్మకు నా బాధ అర్థమవుతుంది. కానీ ఆమె సూచించే పరిష్కారమార్గం పేరు భైరవి. భైరవి నా మేనమామకు ఒక్కగానొక్క కూతురు. బాగా డబ్బుంది. చిన్నప్పట్నించీ ఉన్న చనువువల్ల నన్ను ఒరేయ్ అని పిలవడమే కాకుండా వెధవా అనీ తిట్టగలదు. మరీ అనాకారి కాదుగానీ పుష్టి అనడానికి ఇబ్బంది పడేటంతా, లావు అనడానికి మనస్కరించేటంతా వళ్ళుందామెకు. ఆమెకు పెళ్ళి కావడం కష్టమేమో అనిపించేదాకా మామయ్య కూడా నన్ను దృష్టిలో తెచ్చుకోలేదు. నాకు ఉద్యోగం వచ్చినప్పట్నించీ ఆయన అమ్మమీద ఒత్తిడి తెస్తున్నాడు. అందుకని అమ్మ నేనెప్పుడు వదినమీద ఫిర్యాదు చేయడానికి వస్తానా అని ఎదురు చూస్తూంటుంది. ఆమెకు దొరికిపోవడమూ నాకిష్టముండదు.

వదినను శాసించగలడు కదా అని భ్రమపడి అన్నయ్యతో చెప్పుకుంటే వాడు "అందువల్ల ప్రయోజనం పొందుతున్నది నేను కాబట్టి- నీకు సలహా ఇవ్వాలన్నా పక్షపాతబుద్ధితో వ్యవహరిస్తానని భయంగా ఉంది. ఇంకెవరికైనా చెప్పుకో" అని తప్పించుకోబోయాడు.

నేను అంత సులభంగా వదిలిపెడతానా, "ఫరవాలేదు. చిన్నప్పట్నించి నువ్వు నాకు తెలుసు. నీ సలహా నాకు శిరోధార్యం" అంటూ వాడిని బుట్టలో వెయ్యబోయాను. కానీ పెళ్ళైన వాళ్ళు ఒక్క పెళ్ళాం దగ్గర తప్ప మిగతా అన్ని చోట్ల మహాతెలివిగా ఉంటారన్న జీవిత సత్యం అప్పటికింకా నాకు తెలియదు. అన్నయ్య వెంటనే, "అయితే వదిన ఎలా చెబితే అలా చెయ్యి" అని చెప్పేసి తన హెచ్చరికను ముందే అర్థం చేసుకుని ఉంటే బాగుండేది అన్నట్లు నావంక జాలిగా చూసి అక్కణ్ణుంచి వెళ్ళిపోయాడు. ఆ తర్వాత నేనీ విషయం ప్రస్తావిస్తానన్న అనుమానం వస్తే చాలు. "నీలాంటి తమ్ముడుండడం నా అదృష్టం. లేకుంటే నా పని ఐపోయేది" అని నా ముందరికాళ్ళకు బంధం వేస్తూండేవాడు. నాలాంటి సంగతటుంచి నాకసలు తమ్ముడే లేకపోవడం వల్ల పెళ్ళి చేసుకోవాలంటే భయపడుతున్నాను.

నా అసహాయత తెలిసిన వదిన నాకు చెప్పని పని లేదు. బియ్యం ఏరమంటుంది. ఉల్లిపాయలు తరగమంటుంది. కూర కలపమంటుంది. పాలు పొంగిపోకుండా చూడమంటుంది. విజిలు రాగానే కుక్కరు కట్టేయమంటుంది. ఇంకా బజారు పనులు. ఇవన్నీ ఒక ఎత్తయితే నానిగాడి పనులు ఒక ఎత్తు.

నాకుద్యోగం వచ్చేసరికి నానిగాడికి ఆరేళ్ళు. వాడి రూపానికీ, తెలివికీ ముచ్చటపడి కావాలనే చేరదీస్తే వదిన వాణ్ణి నాకు బాధ్యతగా మార్చేసింది. వాడి స్కూలు, పుస్తకాలు, హోంవర్కు వగైరాలన్నీ చూసుకోవాల్సింది నేనే! అది ఎంతవరకూ దారి తీసిందంటే నానిగాడు ఏ తప్పు చేసినా అంతా నన్నే సంజాయిషీ అడుగుతారు. అది వాడి నిష్పూచీకి కారణమైంది.

ఇప్పుడు నానిగాడి వయసు తొమ్మిది. నాకింకా పెళ్ళి భయం పోలేదు. కానీ భైరవికీ ఇంకా పెళ్ళి కాలేదన్న భయముంది. మా ఇంట్లో అన్నయ్య, వదిన హనీమూన్ దంపతుల్లా జీవితం గడుపుతున్నారు. అమ్మ, నాన్న బాధ్యతలెరుగని ప్రశాంత జీవనం నడుపుతున్నారు. నేను నానిగాడితో సహా ఇంటిల్లిపాదినీ సేవించుకుంటున్నాను. అలాంటి సమయంలో నానిగాడు కుక్క కావాలని బాంబు పేల్చాడు.

నానిగాడి క్లాస్‌లో కొత్తగా చేరిన సోనూకి బాక్సర్ అనే కుక్క ఉంది. సోనూ రోజూ నానిగాడికి బాక్సర్ లీలలు చెబుతూంటాడు. అవి విన్నాక తనకూ ఓ కుక్క కావాలన్న కోరిక వాడిలో మొలకెత్తి చాలా తొందరగా మహావృక్షమైంది. అందుకు అమ్మ వాణ్ణి తిట్టింది. నాన్న మందలించారు. అన్నయ్య కుక్కను పెంచడంలో ఉన్న ఇబ్బందులన్నీ చెప్పాడు. ఇప్పటికే ఇంటిపనులతో తలమునకలౌతున్నాననీ కుక్క సంరక్షణ చూడడం తనవల్లకాదనీ వదిన తేల్చి చెప్పేసింది.


నానిగాడు కుక్కకు సంబంధించి అన్ని పనులూ తను చేసేస్తానని రాజకీయ నాయకుల స్థాయిలో వాగ్దానాలు చేసేసాడు. వాణ్ణి సముదాయించడానికి మార్గాలేమీ దొరక్క ఇంటిల్లిపాదీ సతమతమౌతున్న సమయంలో ఇందిరత్త వచ్చింది మా ఇంటికి. ఆమె మాకు దూరపుబంధువు. ఆమె భర్త ఇటీవలే ఆఫీసు పనిమీద ఫారిన్ వెళ్ళాడు. ఇంట్లో ఆమె, కూతురు వాణి మాత్రమే ఉన్నారు. నాకు తెలిసి వాణికి ఏడాది క్రితమే పెళ్ళిసంబంధం నిశ్చయమైంది. బహుశా వచ్చే ఏడాది పెళ్ళి చేస్తారు.

వాళ్ళు లోఫర్ అనే కుక్కను పెంచుతున్నారు. లోఫర్ ఉంది కాబట్టి మగతోడు లేకున్నా ఫరవాలేదని ముందనుకున్నా మామయ్య వెళ్ళి వారం తిరక్కుండానే కుక్క కుక్కే మగాడు మగాడే అని జ్ఞానోదయమవడంతో మగసాయానికి నన్ను పిలవాలని వచ్చిందిప్పుడత్తయ్య.

"మా పనులన్నీ మేమే చేసుకుంటామయ్యా! ఊరికే నువ్వింట్లో ఉంటే చాలు. మాకు కొండంత ధైర్యం" అంటూ అత్తయ్య హఠాత్తుగా నన్ను హీరోను చేసేస్తే నేను ఉబ్బిపోయాను. కానీ ఇంట్లో వాళ్ళంతా నన్ను త్యాగం చేయడానికి వెంటనే ఒప్పేసుకుంటే ఆశ్చర్యంతో పాటు అనుమానం కూడా కలిగింది.

నా అనుమానం వృధా పోలేదు. వదిన నానిగాణ్ణీ నాతో పాటు పంపుతానంది. అక్కడ కుక్కపిల్ల సంరక్షణ నిజంగా వాడే చేసి తన వాగ్దానాలను నిలబెట్టుకుంటే కనుక వాడికి కుక్కపిల్లను కొనిస్తానంది. వాడు లేకపోతే తనతల్లి ప్రాణం గిలగిలలాడిపోతుందనీ ఐనా వాడికి

**వసుంధర**



కుక్కపిల్ల
విషయం అవగాహన కావాలని సరిపెట్టుకుంటున్నాననీ దిగులు నటించింది. అంతా ఆమెను సెభాషని మెచ్చుకున్నారు. అత్తయ్యైతే, "ఊళ్ళో ఊళ్ళేనే కదా! మీకే బెంగా లేకుండా మా అల్లుడు పిల్లాణ్ణి రోజూ ఒకసారి చూపించి తీసుకొస్తూంటాడులెండి" అనేసింది. వాళ్ళమ్మాయి అందగత్తె అని తెలిసినా నా మనసుకు అత్తయ్య కలిపిన వరసకంటే అంటగట్టిన అదనపు బాధ్యతా, ఆ అంటగట్టడంలో చూపిన చొరవా ఎక్కువ హత్తుకుని పెనంమీంచి పొయ్యిలోకానీ పడటం లేదుకదా అనిపించింది.

అదలాగుంచితే నానిగాడూ నాతో వస్తున్నాడన్నందుకే నాగుండె గుభేల్మంది. వాడు పుట్టి పెరుగుతున్నది మొదలు వాడి పనుల ముందు ఇంటిపనులన్నీ పెద్దగీత పక్కన బుల్లిగీతగా మారిపోయాయి. అందుకని నేను తల్లీబిడ్డల అనుబంధం గురించి గొప్పగా చెప్పి, "ఓ కుక్కపిల్ల కోసం తల్లి బిడ్డనుంచి వేరు కాకూడదు. అంతగా కావాలనుకుంటే నేను తిరిగివచ్చేక నానిగాడికి ఓ కుక్కపిల్లను కొనిపెడతాను. వాడు చేసిన వాగ్దానాలు నిలబెట్టుకోకపోతే నేనే ఆ కుక్కపిల్ల సంరక్షణ చూసుకుంటాను. రా?" అనేసాను. అప్పటికి ప్రమాదం తప్పితే చాలనుకోవడం వల్ల భవిష్యత్తు గురించిన ఆలోచనే నాకు లేకుండా పోయింది.

విధం చెడ్డా ఫలం దక్కలేదు. నా మాటలను ఇంట్లో చర్చకు పెట్టారు. అప్పుడు నాకే తెలియని ఎన్నో విశేషాలు గురించి బయటపడ్డాయి. నానిగాడికి ముందు నేనుట. తర్వాతే తల్లి. నెలకు ముప్పై రోజులూ వాడు నా దగ్గరే పడుకుంటాడు. నేను దగ్గర లేకపోతే బెంగపెట్టుకుంటాడనే వదిన కుక్కపిల్ల వంక పెట్టి వాణ్ణి నాతో పంపిస్తోంది.

మా అనుబంధం గురించి వదిన కథలు కథలుగా వినిపిస్తూంటే అత్తయ్యతో సహా అక్కడున్న వారందరూ కళ్ళనీళ్ళు పెట్టుకున్నారు. నా కళ్ళూ చెమర్చాయికానీ అందుక్కారణం వేరు.


నానిగాడికి నాతో ఉన్న అనుబంధమెలాంటిదో చెప్పలేను కానీ వాడు కుక్కపిల్లతో ఆడుకునే అవకాశాన్ని ఏమాత్రమూ వాయిదా వెయ్యడానికిష్టంలేక నాతో వస్తానని పట్టుబట్టాడు.

అత్తయ్యిల్లు మా ఇంటికి పది కిలోమీటర్లుంటుంది. కానీ నా ఆఫీసూ, నానిగాడి స్కూలూ కూడా ఇక్కడికే దగ్గర. అత్తయ్య నిజంగానే నాకు ఇంటి పనులేమీ చెప్పడం లేదు. రుచిగా వంటలు కూడా చేసిపెడుతోంది. వరసకు మరదలైన వాణి నాకు మంచి కంపెనీ ఇవ్వడానికి ఉత్సాహం చూపిస్తోంది. ఉన్న ఇబ్బందల్లా లోఫర్ తోనే...

లోఫర్ని మామయ్యగారు కేవలం వాణి సంరక్షణ కోసం కొన్నారు. అది ఆమెను ఒక్కక్షణం కూడా విడిచిపెట్టదు.

ఎవరైనా ఆమెను తాకబోతే పెద్దగా మొరుగుతుంది. వాణి జోలికి వెళ్ళకపోతే అది ఇంటికి వచ్చిన దొంగను చూసి కూడా మొరగదు. వాణి బయటకు వెళ్ళిందంటే కూడా లోఫర్ ఉండి తీరాల్సిందే. ఆమె కాలేజీకి వెడుతోందంటే కాస్త ఊరుకుంటుంది కానీ ఆ విషయమై దానికి నమ్మకం కుదరాలి. అందుకు ముఖ్యంగా ఆమె చేతిలో పుస్తకాలుండాలి.

నానిగాడి రాక వాణికి కలిసొచ్చిందనే అనాలి. లోఫర్ నానిగాడికి చాలా నచ్చేసింది. దాని పనులన్నీ తనే చేస్తానంటాడు. వీలు దొరికినప్పుడల్లా దానితోనే ఆడుకుంటాడు. స్కూలు కూడా మానేస్తానంటాడు. లోఫర్‌కీ వాడి దగ్గర బాగా చనువైంది. ఎటొచ్చీ పైకి చెప్పడు కానీ నేను పక్కన లేకుంటే మాత్రం లోఫర్ అంటే మనసులో వాడికి భయముంది. దాంతో నాకు ఆఫీసునుంచి వచ్చేక బయట తిరిగే స్వేచ్ఛ పూర్తిగా పోయింది. మేము ఇంట్లో ఉంటే అత్తయ్య, వాణి లోఫర్ని మాకొదిలి హాయిగా బయటకు వెళ్ళిపోతున్నారు.



స్కూల్నించి వచ్చేక నానిగాడు హోంవర్కు బాధ్యత నాకప్పజెప్పి తను లోఫర్‌తో ఆడుకుంటాడు. అత్తయ్య, వాణి మాతో "హేవ్ నైస్ టైమ్" అని టాటా చెప్పి వెళ్ళిపోతారు. ఇంట్లో వాడు, నేను, కుక్కపిల్ల. ఆ నైస్‌టైమ్‌లో హోంవర్కొక్కటే అయితే ఫరవాలేదు ఇంకా బోలెడున్నాయి.

లోఫర్‌కి తిండిపెట్టాలంటే చిన్నపిల్లలకులా వళ్ళు నిమురుతూ నోట్లోకి వేళ్ళుపెట్టి అందించాలి. దాని కాలకృత్యాలు తీర్చి వంటి శుభ్రం చూడాలి. అవన్నీ నాకు అసహ్యం. నానిగాడికీ అసహ్యమే కానీ నన్ను చేయమని ఏడుస్తాడు. వాణ్ణి బుజ్జగించడం నా వల్లకాదని ఊరుకుందుకు లేదు. లోఫర్‌కి ఏ లోటు జరిగినా వాణి సహించదు. సంజాయిషీలు వినడం ఆమెకిష్టముండదు. చిన్నపిల్లాడని కూడా చూడకుండా ఆమె నానిగాణ్ణి ఎటాక్ చేస్తుంది. మరి నానిగాడి బాధ్యత నాదికదా! వాణికి కుక్కపిల్లమీద ఉన్నపాటి ప్రేమ నాకు నానిగాడి మీద లేదనిపించుకోవడం ఇష్టం లేక నేను కుక్కకు చాకిరీ చేస్తున్నాను. అందులో నాకు కొంత తృప్తి కూడా ఉంది. వాణి నానిగాడు కుక్కకు చేస్తున్న సంరక్షణను మెచ్చుకుంటోంది. అంటే నన్ను మెచ్చుకున్నట్లే కదా!

మరి నానిగాడు రెచ్చిపోయి ఇందిరత్త ఇంటిముందు తగిలించిన 'కుక్క ఉన్నది జాగ్రత్త' బోర్డును తీసేసాడు. లోఫర్ బొమ్మవేసి దాన్ని అందంగా తయారుచేస్తాడట. వాడికి చిత్రకళలో కొంత ప్రవేశముంది. అయితే నానిగాడికీ వాణికీ బొత్తిగా పడేది కాదు. లోఫర్ తనకు దూరమై నానిగాడికి దగ్గరవుతోందని ఆ అమ్మాయి అనుమానం. అందుకని తనున్నప్పుడు అది పూర్తిగా తన స్వంతం సుమా అని నానిగాడు గ్రహించాలని తాపత్రయపడేది. నానిగాడూ తక్కువ తినలేదు. లోఫర్ మాత్రం వీళ్ళ పోటీకి ఎంతో గర్వపడి మరింత సంతోషంగా ఉండేది.

కుక్కకు విశ్వాసమంటారుగానీ అది చాకిరీ చేస్తున్న నన్ను ఏమాత్రమూ పట్టించుకోకుండా ముద్దుచేసే వాళ్ళిద్దరికే ప్రాధాన్యమిచ్చేది.

నానిగాడికి వాణితో పడకపోవడం ఒక విధంగా నాకు మంచిదే చేసింది. ఆమెకు నానిగాడిని భరిస్తున్నందుకు నామీద జాలి పుట్టింది. నాతో ఎంతో అభిమానంగా మాట్లాడుతూండేది. నన్ను పొగుడుతూండేది. ఆమె మాటల్లో నాకు ప్రేమ ధ్వనించేది. అప్పటికే ఆమెకు పెళ్ళి కుదిరిందని తెలిసినా ఆమెను పెళ్ళి చేసుకుంటేనో అనిపిస్తూండేది.

ఆమె చూపుతున్న చనువిచ్చిన ధైర్యంతో ఒకరోజు ఆమెకు నిర్ణయించబడిన వరుడు శరత్ ప్రస్తావన తెచ్చాను. ఆమె నిట్టూర్చి, "మేమెవరికీ చెప్పడం లేదు. శరత్ గురించి కొన్ని నిజాలు తెలిసాయి. ఆ సంబంధం వదులుకున్నాం" అంది.

వాణి పట్ల నాకు ఆకర్షణ పెడుతున్నట్లుంది. ఆమె మాటలకు ఆశ్చర్యంకంటే ఆనందమే ఎక్కువ కలిగింది. అప్పట్నించీ నాకామెపట్ల ఆసక్తి పెరిగింది. ఆమె నుంచి నాకు మాచింగ్ రెస్పాన్స్ వచ్చింది. మా ఇద్దరికీ ఏమేమో మాట్లాడుకోవాలనుండేది.

అయితే నన్ను నానిగాడూ, ఆమెను కుక్కపిల్లా వదలక మా ఏకాంతం బౌబౌ మనేది.

అదేమిటో నానిగాడు వదిన్ని చూస్తానని మాటవరసక్కూడా అనేవాడు కాదు. ఫోన్లు మాత్రం చేసేవాడు. ఆ ఫోన్లోనూ లోఫర్ గురించే మాట్లాడేవాడు. ఓసారి వదిన విసుక్కుని, "నువ్వా కుక్క ప్రసక్తి మానేదాకా ఇంటికి రాకు. నేనూ నిన్ను చూడ్డానికి రాను" అంటే నేను కలవరపడి, "అలాగనేయకు వదినా! నానిగాడు నిన్ను బాగా మిస్సవుతున్నాడు" అన్నాను. వదిన వెంటనే, "హి ఈజ్ ఇన్ సేఫర్ హాండ్స్" అని ఫోను పెట్టేసింది.

మరి నాకూ, వాణికీ ఏకాంతం లభించేదెలా?

ఒకరోజు నేను ఆఫీసు సెలవు పెడితే వాణి కాలేజి ఎగేసింది. ఇద్దరం ఓ పార్కులో కలుసుకున్నాం. మేమింకా మాటలు మొదలుపెట్టలేదు.

మా దగ్గరికో జంట వచ్చింది. వాళ్ళతో ఓ కుక్క వచ్చింది. దాని పేరు డాఫర్.

ఆ జంట కూడా ప్రేమికులే. పెద్దల అనుమతితోనే బయటకు వచ్చారు. డాఫర్ అమ్మాయింట్లో పెంపుడు కుక్క. ఆమెకు కాపలాగా వచ్చిందేమో అది వాళ్ళ మాటల్లో ఏమాత్రం ప్రేమ ధ్వనించినా మొరిగేసి అబ్బాయి వంక గుర్రుగా చూస్తోంది. ఏం చేయాలా అనుకుంటూండగా వాళ్ళకు మేము కనిపించాం. గతంలో ఆ అమ్మాయి, వాణి కుక్కలతో షికారుకొచ్చినప్పుడు డాఫర్‌కీ, లోఫర్‌కీ మంచి స్నేహమయిందిట. వాణిని చూడగానే డాఫర్ లోఫర్ కోసం పరుగున వచ్చింది.

"ఇంటికోసారి సెల్ కొడితే లోఫర్, డాఫర్ మాట్లాడుకుంటారు. మనకూ బెడద ఉండదు" అందా అమ్మాయి. వాణి నంబరు చెబితే ఆ అమ్మాయి ఫోను చేసింది. అవతల ఇందిరత్తయ్య ఫోను తీసింది. ఆ అమ్మాయి వెంటనే, "ఆంటీ! మా డాఫర్ మీ లోఫర్‌తో మాట్లాడుతుందిట. ఒక్కసారి పిలుస్తారా?" అంది. ఇందిరత్తయ్య

## మల్లికా మాయ

**బాలీవుడ్‌లో సంచలనం సృష్టించిన రొమాంటిక్ భామ మల్లికా షెరావత్ జాకీచాన్ సరసన ఓ హాలీవుడ్ సినిమాలో నటిస్తున్న సంగతి తెలిసిందే. ఆ ఒక్క సినిమాయే కాదు, ఇప్పుడు మరో హాలీవుడ్ సినిమాలోనూ చాన్స్ కొట్టేసింది మల్లిక. ఇది కూడా జాకీచాన్ సరసనేనట. మల్లికా షెరావత్ సమ్మోహనానికి హాలీవుడ్ కూడా దాసోహమంటుందన్నమాట. మరి తెలుగు తెరకి మల్లిక వచ్చేదెప్పుడో!**

ఆ అమ్మాయి వివరాలు కూడా ఏమీ అడక్కుండా లోఫర్ని పిలిచింది. అవి డాగ్ మానర్స్‌ని తర్వాత నాకు తెలిసింది. కాసేపు లోఫర్ డాఫర్ ఫోన్లో మొరుక్కున్నారు. ఆ దృశ్యం చూస్తూ నేను వాణితో ఏకాంతం విషయం కూడా మరిచిపోయాను. గుర్తొచ్చే సమయానికి మేము ఇంటికి వెళ్ళే వేళయింది.

"నాకో రోజు సెలవు. నీకో రోజు కాలేజీ వృథా" అన్నాను బాధగా.

"పోనీలే. లోఫర్ ఎంజాయ్ చేసింది" అంది వాణి తృప్తిగానే.

"లోఫర్ సంగతి సరే. మరి మన సంగతి?" అన్నాను.

"లోఫర్ తర్వాతే మనం" అంది వాణి.

"లోఫర్ కుక్క పిల్ల. మనం మనుషులం. మన తర్వాతే లోఫర్" అన్నాను ఆమె పొరపడితే సవరించుకుంటుందని.

"శరత్ కూడా ఇలాగే అన్నాడు. కానీ నాకు ఎవరైనా లోఫర్ తర్వాతే" అంది వాణి.

"మరి నేను?" అన్నాను.

"నువ్వు లోఫర్‌ని ఎంతబాగా చూసుకుంటున్నావో నాకు తెలుసు. శరత్‌కి దాని పొడే గిట్టేది కాదు. నువ్వయితే దానికి నేను చిరాకుపడే పనులు కూడా చేస్తున్నావు. నీలాంటివాడి కోసమే నేను చూస్తున్నాను. నిన్ను పెళ్ళి చేసుకుంటే నేను, లోఫర్ ఇద్దరం అదృష్టవంతులం అవుతాము" అందామె.

నానిగాడికోసం నేను కుక్కను ప్రేమించాను. కుక్క కోసం వాణి నన్నిష్టపడింది.

నా చేతలు వాణికి కలిగించిన దురభిప్రాయాన్ని మళ్ళీ చేతలతోనే తొలగించాలని ఆరోజు నుంచీ నేను లోఫర్ పనులు చేయడం మానేసాను. బాధ్యత తన మీద పడేసరికి నానిగాడికి కుక్కపిల్లంటే మోజు తగ్గి చిరాకు మొదలైంది. దాని బాధ్యతలు సరిగ్గా చూడ్డం లేదని వాణి తనపై అంతెత్తున లేస్తే, "అది నీ కుక్క. దాని పన్లు నువ్వే చేసుకో" అనేసాడు వాడు.


"అయితే ఇక మీదట నిన్ను లోఫర్‌తో ఆడుకోనివ్వను" అంది వాణి.

"అసలు నేనిక ఈ ఇంట్లోనే ఉండను" అన్నాడు నానిగాడు.నానిగాడు వెనక్కు వచ్చేస్తున్నాడని తెలియగానే వదిన లక్ష కారణాలు చెప్పి నన్నూ వెనక్కు రప్పించుకునే ఏర్పాటు చేసింది. బయల్దేరేముందు నానిగాడు తను మార్పుచేసిన బోర్డుని వాణికిచ్చి, "ఇప్పుడు ఇంటి ముందు తగిలిస్తే బాగుంటుంది" అన్నాడు.

వాణి కుతూహలంగా ఆ బోర్డు చూసి, "ఇదేమిటీ కుక్కలున్నాయి జాగ్రత్త! అని మార్చావు. మా ఇంట్లో ఉన్నది ఒకటే కుక్కైతే!" అంది.

"ఈ విషయంలో నీ అభిప్రాయం వేరు. నా అభిప్రాయం వేరు" అన్నాడు నానిగాడు తడుముకోకుండా.

వాణికి కోపం వస్తుందేమోనని భయపడ్డానుకానీ ఆమె



అస్పష్టంగా, "శరత్ కూడా ఇలాగే అన్నాడు" అని గొణుక్కున్నట్లనిపించింది నాకు.

ఇల్లు చేరుకున్నాక వదిన నాతో, "శరత్ సంబంధం చెడిపోయినందుకు వాణి తల్లిదండ్రులు బాగా అప్సెట్టయ్యారు. ముందుగా అబ్బాయికీ, అమ్మాయికీ అవగాహన ఉంటే మళ్ళీ అలాంటి పరిస్థితి రాదనుకుంది ఇందిరత్త. మగసాయం పేరుతో నిన్నింటికి తీసుకుని వెళ్ళింది. నువ్వు వాళ్ళకు బాగా నచ్చావు. కుక్కపిల్ల కోసం శరత్‌నైతే వదులుకోవచ్చునుగానీ నిన్ను వదులుకోరాదని ఇందిరత్త వాణికి నచ్చజెప్పింది. ఈ సంబంధం మనింట్లో అందరికీ ఇష్టమే. ఇక అబ్బాయిగారు పెళ్ళికి సిద్ధపడాలి" అంటూ ఓ కొత్తవిషయం చెప్పింది.

నేను ఆశ్చర్యపడినప్పటికీ వాణి నారాణి అవుతుందంటే చెప్పలేనంత సంతోషం కలిగింది. అయినా నమ్మకం కుదరక, "మన నానిగాడా అమ్మాయిని బాగా విసిగించాడు. ఆ అమ్మాయీయింటి కోడలు కావాలనుకుంటే అది చిత్రమే!" అన్నాను.

"అసలు నానిగాడివల్లే ఈ పెళ్ళి కుదిరింది. కన్నతల్లే వాడి ఆగడాలు భరించలేదు. అలాంటిది నా మరిది వాడి పూర్తి బాధ్యత తీసుకున్నందుకు వాణి తెగ ఇంప్రెస్సైపోయింది.

అనుభవం మీద చెబుతున్నాను. ఈరోజుల్లో ఏ ఆడపిల్లకైనా కుక్కపిల్లకంటే కన్నబిడ్డలే టెర్రర్" అంటూ వదిన నాకు మరో కొత్తవిశేషం చెప్పింది.

"మరి వాణి తన కుక్కపిల్లనేం చేస్తుంది?" అన్నాను కుతూహలంగా.

"ఆ అమ్మాయికి మన నానిగాణ్ణి మంచిచేసుకోవాలనుంది. లోఫర్ ఇక వాడిదేనట?" అంది వదిన.

"నానిగాడు లోఫర్‌తో ఆడుకోమంటే ఆడుకుంటాడు కానీ దానికి చాకిరీ చెయ్యలేడు" అన్నాను బెంగగా.

"అందుకు బాబాయున్నాడంటున్నాడు వాడు. పైగా వాడికి నువ్వు ఇదివరకెప్పుడో వాగ్దానం చేసావుట కూడా" అంది వదిన. దశరథుడు కైక విషయంలో చేసిన తప్పును నేను నానిగాడి విషయంలో చేసినట్లు అప్పుడు నాకు గ్రహింపయింది కానీ ఏం లాభం, చేతులు కాలిపోయాయి.

నాకు వాణితో పెళ్ళయింది.

నానిగాడు కుక్కపిల్లను సంపాదించుకున్నాడు. లోఫర్ని పోగొట్టుకోకుండానే వాణి నన్ను సంపాదించుకుంది. వదిన పని సాయానికి వాణిని సంపాదించుకుంది. మరి నేను?

పెళ్ళైన మరిదికి పెళ్ళికాని మరిది కంటే బాధ్యతలెక్కువని నేనంటే అసలు విషయం అర్థం చేసుకోక అది సహజమే కదా అంటారంతా.

ఈ పరిస్థితుల్లో పెళ్ళైన ఏడాది తర్వాత వాణి నాతో, "మీకో శుభవార్త! మీరు తండ్రి కాబోతున్నారు" అన్నప్పుడు నా గుండె గుభేల్మనదూ?

## నిజంగా లక్కీయేనా?

**సల్మాన్ ఖాన్ హీరోగా నటించిన 'లక్కీ' అనే సినిమా ఈమధ్య రిలీజ్ అయింది కదా! ఇందులో సల్మాన్ సరసన నటించడానికి హీరోయిన్ అన్వేషణ జరిగినప్పుడు దాదాపు 800 మంది కాలేజీ గాళ్స్‌ని ఇంటర్వ్యూ చేసారట. చివరికి ఆ లక్కీ చాన్స్‌ని స్నేహ ఉల్లాల్ అనే అమ్మాయి కొట్టేసింది. స్నేహలో ఐశ్వర్యారాయ్ పోలికలు చాలావరకు ఉండడం వల్లనే ఆమె పట్ల సల్మాన్ ఇంటరెస్టు చూపించాడంటున్నారు. అయితే లేటెస్టు సంగతేంటంటే- ఆ సినిమా చెప్పుకోదగిన హిట్ కొట్టలేదు కాబట్టి, ఇందులో హీరోయిన్‌గా సెలెక్టు కానీ వాళ్లు లక్కీనా, లేక హీరోయిన్ అయిన స్నేహ లక్కీనా అనేది పాయింటయింది.**